సాక్షి పెద్దపల్లి

బుధవారం ‌। 8 ‌। ఫిబ్రవరి ‌। 2023



ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ముందస్తు సాగు ముంచింది..!

జిల్లాలో మొగిపురుగు దెబ్బకు రైతులు విలవిల్లాడుతున్నారు. ఖరీదైన రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. 8లో▸

గరిష్టం/కనిష్టం

33.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత అధికం అవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

పల్లె వెలుగులు

ఉపాధిహామీలో లక్ష్యం మించి పనులు

- పల్లెప్రగతిలో ఉమ్మడి జిల్లాల పనితీరు భేష్
- తలసరి ఆదాయంలో కరీంనగర్ టాప్
- సాగుదారులు, కార్మికుల సంఖ్య ఎక్కువే
- తేల్చిన సామాజిక, ఆర్థిక సర్వే–2023

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రబడ్జెట్‌లో భాగంగా ప్రభుత్వ ప్రణాళిక విభాగం తాజా సామాజిక ఆర్థిక సర్వేను ప్రకటించింది. సామాజిక ఆర్థిక సర్వే 2023 నివేదికను ప్రభుత్వం విడుదల చేయగా, అందులో గతేడాదితో పోల్చి చూస్తే జిల్లా అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించింది. రాష్ట్ర సరాసరితో పోల్చి చూస్తే తలసరి ఆదాయం తక్కువగా ఉన్నా, ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ జిల్లా తలసరి ఆదాయం అధికంగా ఉంది. పల్లె ప్రగతిలో ఉమ్మడి జిల్లాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయి. పంటల మార్పిడి, పంటసాగు వైవిధ్యంలో పెద్దపల్లి, కరీంనగర్ రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచాయి. ఆర్థికసర్వేలో ఉమ్మడి జిల్లా వివిధ రంగాల్లో పనితీరు వివరాలు..




లింగ భేదం పెరుగుతోంది..

ఉమ్మడి జిల్లాలో లింగనిష్పత్తి చూసినట్లయితే ప్రతీ వెయ్యి మందికి జగిత్యాలలో 1,002, సిరిసిల్లలో 1,014 మంది ఉన్నారు. అదే కరీంనగర్‌లో 993 మంది, పెద్దపల్లిలో 992 మంది మాత్రమే ఉన్నారు. అదే లింగనిష్పత్తి 0–6 వయస్సు ఉన్న చిన్నారుల్లో చూస్తే ప్రతీ వెయ్యి మంది బాలికలకు జగిత్యాలలో 947, సిరిసిల్లలో 942, కరీంనగర్‌లో 931, పెద్దపల్లిలో 922 మంది మాత్రమే ఉన్నారు.

అక్షరాస్యత శాతం..




ఉమ్మడి జిల్లా పూర్తిగా పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాల కలయిక వల్ల రాష్ట్ర సగటు కంటే తక్కువగానే ఉంది. రాష్ట్ర సరాసరి అక్షరాస్యత 66.54 శాతం ఉండగా, కేవలం కరీంనగర్ జిల్లా 69.16 శాతంతో రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. మిగిలిన జిల్లాలు తక్కువగా ఉన్నాయి.



విద్యుత్ కనెక్షన్లల్లో భేష్




ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, ఇండస్ట్రియల్ విద్యుత్ కనెక్షన్లలో జగిత్యాల టాప్‌లో ఉండగా, వ్యవసాయ కనెక్షన్లలో పెద్దపల్లి, ఇండస్ట్రియల్ కనెక్షన్లు సిరిసిల్లలో తక్కువగా ఉన్నాయి.



పల్లెప్రగతిలో ముందంజ




రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పల్లెప్రగతి నివేదికలను యాప్‌ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలు పల్లెప్రగతి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ మినహా మూడు జిల్లాలు రాష్ట్రంలోనే టాప్ 10 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.



లక్ష్యం మించి ఉపాధిహామీ




ఉమ్మడి జిల్లాలో లక్ష్యం మించి పనిదినాలు కల్పించటంలో అన్ని జిల్లాలు పోటీపడ్డాయి. అత్యధికంగా పెద్దపల్లి 121 శాతం పనిదినాలు కల్పించగా, జగిత్యాల 105 శాతం పనిదినాలతో ఉమ్మడి జిల్లాలో చివరిస్థానంలో నిలిచింది.



పనిచేసే వారు ఎక్కువే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభాలో సగటున 52 శాతం మంది పనిచేస్తున్నారు. ఇందులోనూ వ్యవసాయ ఆధారిత పనుల్లోనే అత్యధికంగా ఉపాధి లభిస్తోంది.



రేషన్ కార్డులే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు, రేషన్ కార్డులు కుటుంబాల కంటే అధికంగా ఉన్నాయి. ఇందులో అన్నపూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డుల్లో జగిత్యాల, గ్యాస్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉన్నాయి.

జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం కార్డులు	గ్యాస్ కనెక్షన్లు (లక్షల్లో)
కరీంనగర్	487	2,80,895	3.95
పెద్దపల్లి	413	2,22,524	2.18
జగిత్యాల	587	3,10,545	3.05
సిరిసిల్ల	344	1,75,484	1.45

విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకోవాలి



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



పత్తిపాకలో రాక్ గార్డెన్ పరిశీలిస్తున్న కలెక్టర్

- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పత్తిపాకలో 'మనఊరు–మనబడి' ప్రారంభం

ధర్మారం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. మండలంలోని పత్తిపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.24.41లక్షలతో మన ఊరు మనబడి కింద చేపట్టిన కంపోనెంట్ పనులు, ఉపాధి నిధులు రూ.61లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు, డిజిటల్ క్లాస్ రూమ్‌ను కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. రెసిడెన్షియల్ విద్యావిధానం తీసుకొచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల పేదలకు విద్యావకాశాలు పెరిగాయన్నారు. కలెక్టర్ సంగీత మాట్లాడుతూ మన ఊరు మనబడి కింద జిల్లాలో 191 పాఠశాలలో 12 రకాల పనులు చేపట్టామన్నారు. పిల్లలు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుంటున్నారని తెలిపారు. కిచెన్ గార్డెన్, మొక్కల పెంపకాన్ని పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ మాధవి, హెచ్‌ఎం షేక్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, సర్పంచు బద్దం సుజాత, ఎంపీటీసీ అజయ్‌పాల్‌రెడ్డి, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జయశీల పాల్గొన్నారు.

ఆడపిల్ల పెళ్లికి పెద్దన్నలా కేసీఆర్..

కల్యాణలక్ష్మి అందిస్తున్న సీఎం కేసీఆర్ పెద్దన్న అయ్యారని మంత్రి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. అంతకుముందు న్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు. న్యాక్ సెంటర్‌తో ఉపాధి దొరుకుతుందన్నారు. సెంటర్‌లో నిరంతరం శిక్షణ ఇచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

కార్పొరేషన్‌లో అవినీతి తప్ప అభివృద్ధి ఏదీ..?

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లో అవినీతి తప్ప అభివృద్ధి కరువైందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా మంగళవారం 47, 48 డివిజన్లలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అస్తవ్యస్తంగా మారిన కార్పొరేషన్‌లో అవినీతి తప్ప అభివృద్ధి కరువైందన్నారు. కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజల బాగోగులపై లేదన్నారు. ఇలాంటి పాలనకు చరమగీతం పలికి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలుపుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి సాధ్యమన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై పోరాటానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ ప్రాంతంలో ఓసీపీ ఏర్పాటుతో ప్రజలు ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో కార్మికవాడలకు స్వచ్ఛమైన నీరు అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. నాయకులు బొంతల రాజేశ్, జక్కుల రాజేందర్, నజీముద్దీన్, మమంకాళి స్వామి, ముస్తాఫా, గాదం విజయ, గట్ల రమేశ్, నాజిమ్, కోటం సతీశ్, ఆసిఫ్, మేకల పోశం, మహేందర్‌రెడ్డి, ముజ్జు, అఫ్రోజ్, జావిద్, తిరుపతి, ప్రవీణ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌ఠాగూర్‌కు గొంగడి, గొర్రెపిల్ల బహూకరించిన యాదవులు

రైలు ప్రమాదాల నివారణకు అప్రమత్తం

- ఉష్ణోగ్రతలను పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది
- మంగళవారం 38 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- పట్టాలపై థర్మామీటర్‌తో గమనిస్తున్న సిబ్బంది

ఓదెల: వేసవికాలంలో రైళ్ల ప్రమాదాల బారిన పడకుండా రైల్వేసిబ్బంది అప్రమత్తం అవుతున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో రైలు పట్టాలు సంకోచవ్యాకోచాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు సిబ్బంది ముందస్తుగా రైలుపట్టాలపై ఉష్ణోగ్రతలను పరిశీలిస్తున్నారు. నివేదికను ప్రతిరోజూ సికింద్రాబాద్‌లోని కార్యాలయానికి పంపిస్తున్నారు. వారంరోజులుగా ఎండల తీవ్రత పెరుగుతుండడంతో రైలుపట్టాలపై థర్మామీటర్‌తో ఉష్ణోగ్రతలను తెలుసుకుంటున్నారు. సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీ వైపు ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు పెరగడంతో రైల్వే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో పీడబ్ల్యూఐ కార్యాలయాల్లో పనిచేసే వాచ్‌మెన్, సిబ్బంది ప్రతిరోజూ ఉష్ణోగ్రత నమోదు వివరాలను రైల్వే జీఎం ఆఫీస్‌లోని ప్రత్యేక నిఘా కార్యాలయానికి పంపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటే రైళ్లవేగాన్ని తగ్గించనున్నట్లు సమాచారం.



పెద్దపల్లిలో రైలు పట్టాలపై ఉష్ణోగ్రత చూస్తున్న వాచ్‌మన్

స్వచ్ఛత.. పరిశుభ్రతలో మనమే టాప్

- ఆన్‌లైన్‌లోనే పంచాయతీ పాలన
- పన్నుల వసూళ్లు వందశాతం సాధిస్తాం
- అదనపు ఆదాయంపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీపీవో చంద్రమౌళి



పెద్దపల్లిరూరల్: 'పంచాయతీల్లో స్వచ్ఛత, పరిశుభ్రత నిర్వహణలో జిల్లా అగ్రభాగాన ఉంది. ఇప్పటికే పలుమార్లు జాతీయస్థాయిలో అవార్డులు కూడా అందుకున్నాం. ప్రభుత్వ పథకాల అమలులో అద్భుత ఫలితాలు అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. జిల్లాలోని 267 పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న వ్యర్థాలు, వర్మి కంపోస్టు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. ఇంటి పన్ను వసూలు లక్ష్యం 87శాతానికి చేరుకున్నాం. దానిని వందశాతం సాధిస్తాం..' అన్నారు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి. దోమల నివారణకు ఫాగింగ్ చేయించడం, హరితహారంలో మొక్కల పెంపకం.. గ్రామాల్లో అందుతున్న సేవలపై మంగళవారం 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: పంచాయతీల్లో స్వచ్ఛత, పరిశుభ్రత పనులెలా ఉన్నాయి..?

డీపీవో: పారిశుధ్య పనులపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సిబ్బందితో పనులు చేయిస్తుండడతో జిల్లా స్వచ్ఛత, పరిశుభ్రతలో అగ్రభాగాన ఉంది.

సాక్షి: తాగునీటి సరఫరా తలెత్తుతున్నాయి..?

డీపీవో: మిషన్ భగీరథ పథకం ద్వారా చాలాగ్రామాలకు నీటిసరఫరా జరుగుతోంది. ఎక్కడైనా లీకేజీలు అయినట్లు సమాచారం అందగానే వెంటనే పనులు పూర్తయ్యేలా చూస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నాం.

సాక్షి: తడి, పొడి చెత్త సేకరణ జరుగుతోందా..?

డీపీవో: ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్త వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించాం. అక్కడక్కడ తప్పితే చాలా గ్రామాల్లో చెత్తనంతా కలిపే ఇస్తున్నారు. డంపింగ్ యార్డుల్లోనే వేరు చేయాల్సి వస్తోంది.

సాక్షి: పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతోందా..?

డీపీవో: ప్రతి పంచాయతీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగాయి. ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులో ప్లాస్టిక్, ఇనుము లాంటివి వేరు చేసి, చెత్తతో వర్మికంపోస్టు తయారీ చేస్తున్నాం. రూ.1,47,116 ఆదాయం పొందాం.

సాక్షి: ఈ–పంచాయతీల సేవలు అందుబాటులోకి వచ్చాయా..?

డీపీవో: జిల్లాలో 267 పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 39మంది ఆపరేటర్ల సహకారంతో ఎంపీవోలు సమన్వయం చేసుకుంటూ ఈ సేవలను అందేలా చూస్తున్నారు. టీ ఫైబర్ సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రతి పంచాయతీలో సేవలు అందుబాటులోకి వస్తాయి.

సాక్షి: దోమల నియంత్రణకు తీసుకున్న చర్యలేంటీ..?



డీపీవో: ప్రతి గ్రామంలో స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి వ్యర్థాలను నిల్వ ఉంచుకోవద్దని, ముఖ్యంగా నీరునిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని అవగాహన కల్పించాం. అపుడప్పుడు ఫాగింగ్ యంత్రం ద్వారా స్ప్రే చేయిస్తున్నాం.

సాక్షి: పన్నుల వసూళ్లు ఎలా సాగుతున్నాయి..?

డీపీవో: గ్రామాల్లో ప్రజలు ఇంటిపన్నులు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. జిల్లాలో 6,35,10,593 డిమాండ్ ఉండగా.. ఇప్పటివరకు 87శాతం వసూలు చేశాం. గడువులోగా నూరుశాతం వసూలు చేస్తాం.

సాక్షి: పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరు ఎలా ఉంది..?

డీపీవో: పల్లె ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పల్లె ప్రకృతి వనాలు ఉపకరిస్తున్నాయి. చాలాగ్రామాల్లో ఆ వనాల్లో ట్రాక్‌లు నిర్మించుకుని మార్నింగ్ వాక్ కూడా చేస్తున్నారు. వనాల్లో ఏమైనా మొక్కలు చనిపోతే వాటిస్థానంలో వెంటనే స్థానికంగా ఉన్న నర్సరీ నుంచి మరో మొక్కను నాటించి పెంచుతున్నారు.

న్యూస్‌రీల్

రక్షణతో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్లు

రామగిరి(మంథని): సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో సాధించాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వీకే.శ్రీనివాస్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ప్లానింగ్)జి.వెంకటేశ్వర రెడ్డి సూచించారు. ఇటీవల డైరెక్టర్‌గా నియామకమైన వారు మంగళవారం ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలను సందర్శించారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 వ్యూ పాయింట్ నుంచి క్వారీలో పనులను పరిశీలించారు. ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఏరియాలపై వివరించారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఉత్పత్తి, రక్షణ, ఉత్పాదకత, రవాణా అంశాలపై సమీక్షించారు. ఎస్‌వోటూ జీఎంలు డి.బైద్య, జి.రఘుపతి, ప్రాజెక్టు అధికారులు ఎన్.రాధాకృష్ణ, ఎం.నరేందర్, కే.నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజినీర్లు ఎం.నాగరాజు, టి. రఘురాం, ఐఈడీ డీజీఎం కే.చంద్రశేఖర్, మేనేజర్ కేవీ.రామారావు, సర్వే అధికారి జీఎల్.రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వాడకం పెంచండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభావతి

రామగిరి: చిరుధాన్యాల వాడకం పెంచాలని శ్రీకొండాలక్ష్మణ్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ కె.ప్రభావతి సూచించారు. మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాధాన్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆహారంలో బియ్యం కన్నా చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, అరికలు, బరిగలు, సాములు, ఊదర్లు వాడడం ద్వారా బలమైన పౌష్టికాహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేగోళపు సదానందం, కళాశాల సూపరింటెండెంట్ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు మూల మంజులత, సలాకుల తిరుపతి, కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్, శృతి తదితరులు పాల్గొన్నారు.

కళ్లను పరీక్షించుకోండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కృపాబాయి

జ్యోతినగర్: ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి తెలిపారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ సప్రాశాలపల్లెలో శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. శిబిరంలో కంటి పరీక్షలతోపాటు అద్దాలు, మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరాల వద్దే ఆధార్ అప్‌డేట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఈడీఎం కవిత తెలిపారు. ఆధార్‌కార్డు పొంది పదేళ్లు దాటినవారు తమకార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

రామగుండంలో జెన్‌కో సివిల్ డైరెక్టర్ పర్యటన



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

రామగుండం: రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు బీ కేంద్రాన్ని మంగళవారం జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్ సందర్శించారు. బీ–థర్మల్‌లో తరచూ సాంకేతిక సమస్యలు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది. విద్యుత్ కేంద్రం, పంపుహౌస్, ఉద్యోగుల నివాస కాలనీల్లో పర్యటించారు. క్వార్టర్లలో మెరుగైన వసతులు కల్పించాలని, విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని, ప్రాజెక్టును 2030 సంవత్సరం వరకు కొనసాగించాలని జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. దీనికి డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. జేఏసీ ప్రతినిధి శంకరయ్య, అబ్దుల్ తఫీ, నర్సింహులు, తాటిపల్లి కృష్ణమూర్తి, కొమ్మురాజుల మల్లేశ్, బొడ్డు యాదగిరి, లగిశెట్టి రవికుమార్, సారయ్యలున్నారు.

క్లుప్తంగా

తెరుచుకున్న వాష్ రూం



తాళాలు తీసిన వాష్ రూం

సాక్షి ఎఫెక్ట్..

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 3న సాక్షిలో పిల్లలు ఒంటికొస్తే ఆరుబయటకే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హైస్కూల్ హెచ్ఎం వాష్‌రూంలకు ఉన్న తాళాలు తొలగించారు. సాక్షి కథనానికి స్పందించిన అధికారులకు, హైస్కూల్ హెచ్ఎంకు, సాక్షికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్, పీఈటీ

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ క్రికెట్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు కామెర భార్గవ్, హేమంత్‌రాజ్, భూపేందర్‌సింగ్, ప్రణయ్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చారని అన్నారు. ఈనెల 17 నుంచి 19వరకు తమిళనాడు రాష్ట్రంలోని శోలింగర్ నగరంలో జరుగనున్న జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్రన్‌తో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఆకలితో ఎవరూ అలమటించొద్దు



మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: పనుల కోసం తన ఇంటికి వచ్చే వారు ఎవరూ ఆకలితో అలమటించొద్దని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంగళవారం మంథనిలోని తన నివాసంలో పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజతో కలిసి ప్రారంభించారు. గతంలో ఇక్కడి పాలకులను కలిసేందుకు వచ్చేవారు గంటలకొద్ది నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉండేవని అన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పేదవారు ఆకలితో అవస్థలు పడొద్దనే నిత్యాన్నదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకునే పేద విద్యార్థులతో పాటు తన నివాసానికి వచ్చే వారికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు.

ముందస్తు సాగు ముంచింది..!



ఈ రైతు పేరు మండల సంపత్. వీణవంక మండలం మల్లన్నపల్లి. ఒకరివద్ద నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరివేశాడు. వారం రోజులకే పురుగుతాకిడికి దెబ్బతింది. పంటను కాపాడుకోవడానికి ఎకరాకు రూ.20వేల చొప్పున రూ.80వేలు వెచ్చించాడు. ఫలితం లేకపోవడంతో చేను చెడగొట్టి పదిరోజుల క్రితం మళ్లీ నాటు వేశాడు. నాటుకు ఎకరాకు రూ.4500 చొప్పున రూ.18వేలు కేవలం కూలీలకే చెల్లించాడు. ట్రాక్టర్‌కు రూ.24వేలు ఇలా.. రెండుసార్లు నాలుగు ఎకరాలకు రూ.1.30లక్షల పెట్టుబడి పెట్టాడు.

- అడ్డగోలు రసాయనాల పిచికారీ
- అయినా కోలుకోని వరిపొలాలు
- డిసెంబర్ 12నుంచి 25లోపు వేసిన పైరుపైనే 'మొగి' ప్రభావం
- చేన్లు చెడగొట్టి మళ్లీ నాట్లు వేసిన రైతులు



మల్లన్నపల్లిలో మళ్లీ నాట్లు వేస్తున్న కూలీలు



మొగిపురుగు ఆశించిన వరి

వీణవంక: జిల్లాలో మొగిపురుగు దెబ్బకు రైతులు విలవిల్లాడుతున్నారు. ఖరీదైన రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. మొగిపురుగుకు తోడు వేరుకుళ్లు, జింకు దాతు లోపం, పచ్చపురుగు తాకిడి ఉండడంతో రైతుకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సూచనలు చేసినా ఫలితం ఉండడం లేదు. అయితే ముందస్తు వరినాట్లు వేయడంతోనే ఈ దుస్థితి వచ్చిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. డిసెంబర్ 25తర్వాత వేసిన వరినాట్లకు పురుగు తాకిడి లేదు. ఇప్పటికే అడ్డగోలుగా పెట్టుబడిన పెట్టిన రైతులు గత్యంతరం లేక చేన్లను చెడగొట్టి మళ్లీ నాట్లు వేశారు. జిల్లాలో ఈ ఏడు 1.91లక్షల ఎకరాలలో వరిసాగులోకి వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు దాదాపు వరి నాట్లు పూర్తయ్యాయి.

డిసెంబర్ 25లోపు వేసిన వరినాట్లపై ప్రభావం

- డిసెంబర్ 12నుంచి 25లోపు నాట్లు వేసిన వరి పైరుపైన ఈ పురుగు ఉధృతి తీవ్రంగా ఉంది. 25 తర్వాత వేసిన నాట్లకు పురుగు తాకిడి అంతంతే కనిపిస్తోంది. గత వానాకాలం పంట చేతికి వచ్చే సమయంలో మొగిపురుగు వ్యాప్తి చెందింది. రైతులు ఎన్ని రసాయన మందు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది.
- పంట కోసిన 40రోజుల్లోనే మళ్లీ యాసంగి నాట్లు వేశారు. దీంతో నాటు వేసిన వారం నుంచే పురుగు విజృంభించింది. జనవరి మొదటి వారంలో నాట్లు వేస్తే ఈ పురుగు వ్యాప్తి చెందకపోయేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. పొలం తడిఆరక ముందే నాట్లు వేయడం కూడా పురుగు ఉధృతికి కారణంగా చెబుతున్నారు.
- నాట్లు వేసి 45రోజులు గడిచినా.. వేసిన కర్ర వేసినట్టే ఉంది. వేరుకుళ్లు, జింకుదాతు లోపం, పచ్చ పురుగు కూడా పైరుపైన ప్రభావం చూపుతోంది. రసాయన మందులకే ఒక్కో రైతు రూ.15వేల పెట్టుబడి పెట్టారంటే పురుగు ప్రభావం ఎలా ఉందో తెలుస్తోంది.
- పంట ఎదగకపోవడంతో చాలామంది రైతులు చేన్లు చెడగొట్టి మళ్లీ నాట్లు వేశారు. దీంతో నారుకు డిమాండ్ పెరిగి ఎకరం నారుకు రూ.2వేలు అదనపు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. కొంత మంది రైతులు వెదజల్లే పద్ధతి, మరికొందరు డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేశారు. జిల్లావ్యాప్తంగా 12వేల ఎకరాలకు పైగా మళ్లీ నాట్లు వేసినట్లు సమాచారం.

ముందస్తు పైరు పైనే ప్రభావం

డిసెంబర్ 25లోపు వేసిన నాట్లపైనే పురుగు ప్రభావం ఉంది. ఆ తర్వాత వేసిన నాట్లకు పురుగు లేదు. వానాకాలం పంట పూర్తయిన వెంటనే యాసంగి నాట్లు వేశారు. అలా కాకుండా కాస్త సమయం ఇస్తే పంటపై ప్రభావం ఉండకపోవచ్చు. అక్కడక్కడ వేరుకుళ్ల ప్రభావం కూడా ఉంది. తడి ఆరని పొలాలకు పురుగు ఉధృతి ఉక్కువగా ఉంది. నాటు వేసిన 10రోజుల్లోపు గుళికలు వాడాలి. లేకుంటే పంటమార్పిడి చేయడం ఉత్తమం. – వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్త, కేవీకే

బొగ్గుబాయి వార్తలు

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి



ఓసీపీ-3 ప్రాజెక్టు వ్యూపాయింట్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్లు

గోదావరిఖని: వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ, ఆర్జీ–2 ఏరియాలోని ఓసీపీ–3 ప్రాజెక్టును సందర్శించారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు మనుగడ సాధ్యమన్నారు. 50 రోజులే ఉన్న క్రమంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డైరెక్టర్ల వెంట ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఇతర అధికారులున్నారు. దీనికి ముందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం క్వారీలోకి ఉత్పత్తి తీరును పరిశీలించారు.

బొగ్గు దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలి



బొగ్గు రేక్‌లను పరిశీలిస్తున్న శశిధర్‌రాజు

గోదావరిఖని: సింగరేణిలో బొగ్గు దొంగతనాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి సంస్థ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రాజు అన్నారు. మంగళవారం ఎఫ్‌సీఐ రైల్వేగేట్ వద్ద బొగ్గు చోరీ తీరును పరిశీలించారు. ఈసందర్భంగా సెక్యూరిటీ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రామగుండం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొగ్గు దొంగతనాలపై ఫిర్యాదు చేశారు. ఆయన వెంట సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన జీఎంలు



జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న జీఎంలు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా విస్తరణలో భాగంగా పెద్దంపేట్ గ్రామానికి సంబంధించిన భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తదితర విషయాలపై జాయింట్ కలెక్టర్ లక్ష్మీనారాయణను మంగళవారం ఆర్జీ–2 జీఎం మనోహర్, ఆర్జీ–3 జీఎం టీవీరావులు కలిశారు. త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని కోరారు.

చంపుతానని బెదిరించిన కొడుకుపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన పుట్ట కమలను చంపుతానని బెదిరించిన ఆమె కొడుకు పుట్ట ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. ప్రణయ్ రెండేళ్ల క్రితం ఇంట్లో తెలియకుండా సబిత అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇంట్లోకి రానివ్వకపోవడంతో వేరేచోట నివాసం ఉంటున్నాడు. జనవరి 30న తల్లి కమల ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లగా ప్రణయ్ ఇంటి తలుపులు, తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. తర్వాత ఆమెను బూతులు తిట్టడంతో పాటు చంపుతానని బెదిరించడంతో బాధితురాలు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన ఎండి.షాహిదాబేగం (45) సోమవారం రాత్రి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలు.. షాహిదాబేగం 20 సంవత్సరాల నుంచి బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. ఆమె భర్త కూడా సంవత్సరం క్రితం పెరాలసిస్ వచ్చి మంచంలోనే ఉంటున్నాడు. తనకున్న అనారోగ్యంతో పాటు భర్తకు కూడా సేవ చేసేందుకు ఇబ్బందులు పడుతుండడంతో జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో షాహిదాబేగం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు షాజిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

బావిలోపడి వృద్ధుడు..

రాయికల్(జగిత్యాల): మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన మోతె పెద్దులు (87) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మోతె పెద్దులు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పాటు భార్య చనిపోయిందనే ఆవేదనతో జీవితంపై విరక్తి చెందాడు. వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు మల్లికార్జున్

మేడిపెల్లి(వేములవాడ): భీమారం మండలం గోవిందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిల్ల మల్లికార్జున్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్కంపల్లి రాజేష్ తెలిపారు. ఈ నెల 10న బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మల్లికార్జున్‌ను ఉపాధ్యాయులతో పాటు పలువురు అభినందించారు. పీఈటీ ప్రశాంత్, సర్పంచ్ మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమ పాల్గొన్నారు.

విధులను ఆటంకపర్చిన వ్యక్తికి జైలు

రామగిరి(మంథని): పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన గొర్ల శ్రీనివాస్‌కు మంగళవారం మంథని కోర్టు న్యాయమూర్తి రూ.వెయ్యి జరిమానాతో పాటు నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై బేతి రాములు తెలిపారు. 2015లో అడవిశ్రీరాంపూర్‌లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మద్యం మత్తులో ఉన్న శ్రీనివాస్ వారిని అడ్డుకొని ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం మంథని కోర్టులో సాక్షాధారాలను ప్రవేశపెట్టగా కేసు విచారణ అనంతరం మెజిస్ట్రేట్ నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారని తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తాలో సోమవారం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తెలిపారు. రామగుండం లారీ ఓనర్స్ అసోసియేషన్, డీసీఎం వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా వాహనాల చార్జీల విషయమై గొడవలు జరుగుతున్నాయని అన్నారు. మంగళవారం లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ జావిద్, వ్యాన్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాజా నిజాముద్దీన్‌లు ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన నాగరాజు, ఆనంద్, రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంలోని పెండింగ్ అంశాలను పూర్తిస్థాయిలో యాజమాన్యం అమలు చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారం జరిగిన చర్చల్లో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగం పూర్తిస్థాయిలో రెండు రోజుల్లో క్లియర్ చేస్తామని, ప్రమోషన్ పాలసీ, సీనియర్ ప్రమోషన్ పాలసీ, ఐటీఐ ప్రమోషన్ పాలసీలు కూడా త్వరితగతిన చేయడానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్లు ఇంజినీరింగ్ ఇన్‌చార్జిల సహకారంతో పూర్తి చేసి నూతన అగ్రిమెంట్ కూడా త్వరలోనే చేయడం జరుగుతుందని యాజమాన్యంకు వివరించడం జరిగిందన్నారు. ఈనెల 13న యాజమాన్యంతో చర్చలు ఉన్నాయని వెల్లడించారు. యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించని యెడల మార్చిలో ఉద్యమాలు ప్రారంభిస్తామని తెలిపారు. కార్మికులందరూ ఎవరి మాయమాటలకు మోసపోకుండా.విషయాలను దృష్టిలో పెట్టుకొని సమన్వయం పాటించి జేఏసీ తీసుకోబోయే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, ఎం శంకర్, శ్రీనివాస్, నాగభూషణం, సత్యం, రాధారపు రాజమల్లయ్య, రాజేశంతోపాటు పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సురేశ్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామ సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొన్న ఘటనలో బీరెల్లి సురేశ్ (50) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. రామగుండంలో కిరాణ దుకాణం నడిపిస్తున్న సురేశ్ వ్యాపార అవసరాల రీత్యా పెద్దపల్లికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగానే సురేశ్ ఎగిరి పడగా బైక్ బస్సు కిందకు దూసుకుపోయిందని అన్నారు. తీవ్ర గాయాలపాలైన సురేశ్ అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించామని, మృతుడి కుటుంబీకులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడు సురేశ్‌కు భార్య వనజ, సాయి, లిఖిత సంతానం ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

గోదావరిఖని: ఇటీవల చీరెకు నిప్పంటుకొని తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న ఎరుకల జనమ్మ (70) మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడు శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ బాబు తెలిపారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యంపై కేసు

మల్యాల(చొప్పదండి): తల్లీ కూతుళ్ల అదృశ్యం కేసులో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. పోలీసుల వివరాలు.. మండలానికి చెందిన ఓ వివాహిత సోమవారం పాఠశాల నుంచి తన కూతురును తీసుకువచ్చేందుకు వెళ్లి అదృశ్యం కావడం కలకలం రేపింది. తల్లీకూతుళ్ల అదృశ్యంపై స్థానిక యువకుడు, ఓ యువతిపై అనుమానం ఉందని వివాహిత తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనుమానితులను పిలిపించి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


విద్యుదాఘాతంలో మున్సిపల్ కార్మికుడికి గాయాలు



గాయపడిన కార్మికుడిని తరలిస్తున్న 108 సిబ్బంది

గోదావరిఖని/కోల్‌సిటీ: పట్టణంలోని న్యూఅశోక టాకీస్ సమీపంలో విద్యుదాఘాతానికి గురై మున్సిపల్ కార్మికుడు ఆయిల్ల సందీప్ గాయపడ్డాడు. సందీప్ మంగళవారం మున్సిపల్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో అక్రమ తెగిపడిన విద్యుత్ వైర్లు తాకి ప్రమాదానికి గురయ్యాడు. వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టారు. కాగా సందీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కార్మికుడి ఆరోగ్య పరిస్థితిపై మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వద్ద ఉండి అవసరమైన సాయాన్ని అందిస్తున్నారు. కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురికావడంపై కార్మిక సంఘాల నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, వై.యాకయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా కోరుకునేలా నగరపాలక సంస్థ మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని అన్నారు.


ఏటీఎంలో షార్ట్ సర్క్యూట్



ఏటీఎం క్యాబిన్‌లో చెలరేగుతున్న మంటలు

రామగుండం: అంతర్గాం జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఏటీఎం సెంటర్‌లో మంగళవారం రాత్రి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా ఏటీఎం లోపలి భాగం అగ్నికి ఆహుతై నప్పటికీ అందులోని కరెన్సీకి ఎలాంటి నష్టం జరగలేదు. కొన్ని రోజులుగా ఏటీఎంలోని ఏసీ పనిచేయక పోవడంతో పాటు క్యాబిన్‌లోకి ఎండ నేరుగా పడటంతో మెషనరీ వేడెక్కి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న అంతర్గాం ఎస్సై సంతోశ్‌కుమార్ ఏటీఎం వద్దకు చేరుకొని ఇరుప్రక్కల మంటలు వ్యాపించకుండా చర్యలు చేపడుతూ ప్రమాదానికి దారితీసిన విషయమై ఆరా తీశారు.

మట్టికుప్ప ఘర్షణ మరణం వరకు..



శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం



హన్మంతు మృతితో రోదిస్తున్న కుటుంబసభ్యులు



హన్మంతు మృతదేహం..

- వేములవాడలో హన్మంతు అనే వ్యక్తి మృతి
- రెండు రోజుల్లో ఇంట్లో శుభకార్యం..
- తండ్రి మరణంతో ఆగిన మూడో కూతురు వివాహం

వేములవాడ: వేములవాడలోని కూరగాయల మార్కెట్ వీధికి చెందిన సోయినేని హన్మంతు (62) తాపీమేస్త్రీగా పనిచేస్తూ ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు. మూడో కూతురుకు కూడా మంచి సంబంధం కుదిరింది. ఈనెల 10న వివాహం చేసేందుకు ముహూర్తం కుదిరించారు. రెండు రోజుల్లో పెళ్లి. ఇంటికి రంగులు.. ఇంటిముందర పచ్చని పందిరి వేశారు. శుభకార్యానికి అంతా సిద్ధం చేశారు. బంధుమిత్రులను ఆహ్వానించారు. అన్ని పనులు పూర్తయ్యాయని అనుకుంటున్న క్రమంలో తన ఇంటికి వెళ్లే చిన్న గల్లీ ప్రారంభంలో ఉన్న ఇంటి ఎదుట మట్టికుప్పను తొలగించాలని యజమాని ఆకుల శంకరయ్యను కోరగా.. మట్టికుప్పను తొలగించలేదు. మున్సిపల్ అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాడు హన్మంతు. మంగళవారం ఉదయం మున్సిపల్ ట్రాక్టర్ వచ్చి మట్టి కుప్పను తొలగిస్తున్న క్రమంలో శంకరయ్య కుటుంబసభ్యులు అడ్డు చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో హన్మంతుపై ఆకుల శంకరయ్య కొడుకు నాగరాజు దాడిచేయడంతో నోట్లోంచి రక్తస్రావం అయ్యింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. రెండురోజుల్లో పెళ్లి కావాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. బాజాభజంత్రీలు మోగాల్సిన ఇంట్లో రోదనలు మిన్నంటాయి. చిన్నపాటి గొడవతో హన్మంతు చితికి చేరాడంటూ కాలనీవాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతుడి భార్య సోయినేని సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.